

యువపథం.. జానపదం

రెండోరోజూ ఉర్రూతలూగిన కృష్ణా తరంగ్



కృష్ణా విశ్వవిద్యాలయంలో రెండోరోజు శుక్రవారం కూడా 'కృష్ణా తరంగ్' ఉర్రూతలూగించింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు జానపద నృత్యాలతో అదరగొట్టేశారు. స్టేజీపైన విద్యార్థులు అదిరిపోయే ప్రదర్శనలు ఇస్తుంటే, స్టేజీ కింద విద్యార్థులు ఈలలు, అరుపులతో చిందులేశారు. 8



దళారుల దందా

పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమంలో హవా

మచిలీపట్నం, అవనిగడ్డ ఆసుపత్రుల్లో దోపిడీ

6

సామాజిక పింఛన్ల పంపిణీలో అనర్హుల ఏరివేత కార్యక్రమం దళారుల పంట పండిస్తోంది. వైసీపీ హయాంలో ఇబ్బడిముబ్బడిగా మంజూరు చేసిన పింఛన్లలో అనర్హుల తొలగింపు కార్యక్రమం జిల్లాలో వేగంగా జరుగుతుండగా, దళారులు రంగంలోకి దిగారు. అనర్హులకు పింఛన్లు తొలగించకుండా ఉండేలా బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఒక్కొక్కరు రూ.40 వేల నుంచి రూ.45 వేలు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఎవరైతే అనర్హులకు పింఛన్లు ఇప్పించారో వారే దళారులుగా మారి నేడు వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం.

- వైసీపీ హయాంలో అనర్హులకు పింఛన్లు ఇప్పించిన దళారులు
- తొలగించకుండా చూసుకుంటామని నేడు భరోసా
- పింఛన్ పోకూడదంటే రూ.45 వేలు ఇవ్వాలని బేరం
- మచిలీపట్నంలో ఆసుపత్రిలో ఓ చోటా నేత వసూళ్లు
- అవనిగడ్డ ఆసుపత్రిలో మధ్యవర్తుల మాయ



మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి

తొలివిడత పింఛన్ల పరిశీలన గడువు ఈనెల 20

జిల్లాలో 2.34 లక్షల మంది వివిధ రూపాల్లో సామాజిక పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 34 వేల మంది దివ్యాంగుల కోటాలో పింఛన్లు పొందేవారే. డీఆర్‌డీఏ విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విభాగం ద్వారా ఇప్పటివరకు 17 వేల మందికి పింఛన్ల పరిశీలనకు నోటీసులు జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం మండల స్థాయిలో ఎంపీడీవోలు, పురపాలక సంఘాల్లో మునిసిపల్ కమిషనర్ కార్యాలయాల నుంచి పింఛన్ పొందే లబ్ధిదారులను ఫలానా తేదీన ఆసుపత్రుల్లో పరీక్షల కోసం వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు వైకల్యం తక్కువగా ఉన్నట్టుగా చూపారని, మళ్లీ పరీక్షలు చేయాలని 4వేల మందికి పైగా అప్పీలు చేసుకున్నారు. వీరితో పాటు నోటీసులు అందుకుని, ఇంకా వైద్య పరీక్షలు చేయించుకోని వారికి ఈనెల 20వ తేదీలోగా పరీక్షలు చేయాల్సి ఉందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. రెండో విడత నోటీసులు జనవరిలో జారీచేస్తామని పేర్కొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : జిల్లాలో రెండు నెలలుగా పింఛన్ల పరిశీలన కార్యక్రమం జరుగుతోంది. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఈ కార్యక్రమం కొనసాగుతుండగా, అవనిగడ్డ, తదితర ఏరియా ఆసుపత్రుల్లో దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలన కొద్దిరోజుల నుంచి ప్రారంభమైంది. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగంలో పనిచేసే ఉద్యోగి మిగతా 6లో..

బహిరంగంగానే బేరాలు

అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా దివ్యాంగుల కోటాలో పింఛన్లు ఇప్పించడంలో కొందరు దళారులు గత ప్రభుత్వంలో చక్రం తిప్పారు. మళ్లీ వారే ఇప్పుడు కూడా తమ హవాను కొనసాగిస్తున్నారు. ఒక్కొక్కరు కనీసం రూ.40 వేలు తగ్గకుండా ఇస్తే పింఛనుకు ఢోకా లేదని బాహాటంగానే చెబుతున్నారు. అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో గురువారం నుంచి పింఛన్ల పరిశీలన కార్యక్రమం ప్రారంభం కాగా, నాలుగైదు రోజుల నుంచి దళారులు ఈ బేరాల పనిలో పడ్డారు. అవనిగడ్డ నియోజకవర్గంలో అధికశాతం మందికి గతంలో దివ్యాంగుల పింఛన్లు ఇప్పించిన వైసీపీ నాయకులే ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. అవనిగడ్డ, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రుల్లో తమ మాట చెల్లుబాటు అవుతుందని, నగదు చెల్లిస్తే కథ తాము నడుపుతామని మాయమాటలు చెబుతున్నారు.

క్వారీలు తవ్విన ప్రాంతాలను చూస్తున్న రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్



వచ్చారు.. వెళ్లారు..

మెట్లపల్లి రిజర్వు ఫారెస్టులో అక్రమ మైనింగ్‌పై నామమాత్రపు తనిఖీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వచ్చారు.. వెళ్లారు.. మొక్కుబడిగా తనిఖీలు చేశారు. కళ్ల ముందు క్వారీ గోతులు కనిపిస్తున్నా చూడనట్టే వ్యవహరించారు. జరిగిన అక్రమాలను కనీసం నమోదు కూడా చేసుకోలేదు. కృష్ణాజిల్లా మెట్లపల్లి రిజర్వు ఫారెస్టులో అక్రమ క్వారీ తవ్వకాలను శుక్రవారం పరిశీలించిన అటవీ అధికారులు మమ.. అనిపించి వెనుదిరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణాజిల్లా మెట్లపల్లి రిజర్వు ఫారెస్టులో అక్రమ క్వారీ తవ్వకాలపై ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)కు స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదు చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో కూడా 'గ్రావెల్ దొంగలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దాదాపు రెండు నెలలు గడిచినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్రమ క్వారీయింగ్‌తో పాటు ఎక్స్‌కవేటర్‌తో పనిచేయించి, కూలీలతో పనిచేయించి నట్టుగా డబ్బు డ్రా చేయడం వంటి మిగతా 6లో..

మావోయిస్టు ఇష్టులా?

పోలీసు ఇన్ఫార్మర్లా?

- మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ వెనుక ఉన్న ఆ ఇద్దరు వ్యాపారులు ఎవరు?
- నగరానికి చెందిన ఇద్దరు వ్యాపారులకు సంబంధం ఉందని మావోయిస్టు పార్టీ ప్రకటన
- చికిత్స కోసం హిడ్మాను నగరానికి తీసుకొచ్చిన వ్యాపారులు
- ఇక్కడి నుంచి మారేడుమిల్లి తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపణ
- ఆ ఇద్దరు వ్యాపారులు ఎవరనే విషయంపై తీవ్ర చర్చ
- ఒకరు ఫర్నీచర్ వ్యాపారి.. మరొకరు సివిల్ కాంట్రాక్టర్
- నగరంలో కలకలం రేపుతున్న మావోయిస్టు పార్టీ ప్రకటన



మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్‌తో బెజవాడ వ్యాపారులకు సంబంధాలున్నాయన్న ఆ పార్టీ ప్రకటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎవరా వ్యాపారులు..? అనే అంశం చర్చనీయాంశంగా మారింది. హిడ్మా అనారోగ్యానికి గురయ్యాడని, చికిత్స కోసం నిరాయుధుడై విజయవాడ వచ్చాడని, అందుకు ఆ ఇద్దరు వ్యాపారులు సహకరించారని, వీరితో పాటు తమ పార్టీ సభ్యుడు ఒకరు పోలీసులకు సమాచారం ఇవ్వటం వల్లే హిడ్మా విజయవాడలో పట్టుబడ్డాడని, హత్య చేసి మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్ అని చెప్పారని ఆ ప్రకటనలో పేర్కొనడం సంచలనం సృష్టిస్తోంది. మావోయిస్టు పార్టీకి సహకరించిన ఆ ఇద్దరు వ్యాపారులు ఎవరు? అనేది చర్చకు దారితీస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ శుక్రవారం కీలక ప్రకటన విడుదల చేసింది. నగరానికి చెందిన కలప-ఫర్నీచర్ వ్యాపారి, బిల్డర్-సివిల్ కాంట్రాక్టర్‌లు హిడ్మా విజయవాడ రావటానికి కారణమని పేర్కొంది. ఈ వ్యాపారులిద్దరూ హిడ్మా గురించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేశారన్నది మావోయిస్టుల ఆరోపణ. అసలు ఈ వ్యాపారులిద్దరూ ఎవరు? పోలీసుల ట్రాప్‌లో ఉండి బలవంతంగా హిడ్మా మిగతా 6లో..



గుడివాడ పోస్టాఫీసు, ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ధర్నా

8

గుడివాడ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే వెనిగండ్ల వినతి

దివిసీమలో సంస్థాగత తలనొప్పి

- కొత్త వారికి అవకాశం ఇవ్వాలని లోకేశ్ సూచన
- భారీగా పెరిగిన టీడీపీ ఆశావహులు
- ఎంతకీ ముడిపడని మండల కమిటీలు

8

గురు భవానీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

» దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 11 నుంచి అయిదురోజుల పాటు జరగనున్న భవానీదీక్ష విరమణలకు వచ్చే వేలాదిమంది భక్తుల భద్రత దృష్ట్యా గురుభవానీలు తమ పేర్లను దేవస్థానంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఈవో వీకే శీనానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు, మీడియా, గురుభవానీ భక్తుల సహకారంతో ఈ ఏడాది దీక్ష విరమణలను విజయవంతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. ఈనెల 11 నుంచి 15 వరకు దీక్షల విరమణలకు సంబంధించి మాల విరమణ ప్రదేశం, ఇతర ముఖ్య ప్రదేశాలలో గురు భవానీలు ఉంటారని సేవచేసే ఉద్దేశ్యంగల గురు భవానీలు తప్పనిసరిగా తమపేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరంగా ఉండేందుకు గూగుల్ ప్లే స్టోర్‌లో భవానీదీక్షల యాప్‌ను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ తెరచి భవానీ దీక్షల యాప్ టైప్ చేసి, ఇన్‌స్టాల్ చేయాలన్నారు. యాప్ ఓపెన్ చేసిన తరువాత గురుభవానీలు తమ గుర్తింపు పత్రాలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గురుభవానీల వివరాలు పేర్ల రిజిస్ట్రేషన్ ద్వారా దేవస్థానంలో ఉన్నట్టయితే గుర్తింపు కార్డుల జారీ వంటి ప్రక్రియను అమలు చేసేందుకు వీలుంటుందన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకొనగోరేవారు 9440011717కు ఫోన్ చేయవచ్చునన్నారు.

నేడు దుర్గగుడి పాలకమండలి సమావేశం

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి రెండో సమావేశం శనివారం వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి ప్రాంగణంలో జరుగుతుందని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశంలో ఈనెల 11 నుంచి ఆలయంలో జరగనున్న భవానీదీక్ష విరమణల ఏర్పాట్లు, భక్తులకు కల్పించే సౌకర్యాలు, భద్రత గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి, మొదటి సమావేశంలో పెండింగ్ అంశాల పైన చర్చించనున్నారు.

22ఏ సమస్యలపై దరఖాస్తు చేసుకోండి

» కలెక్టర్ బాలాజీ



లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, డిసెంబబరు 5 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంత గ్రామాల ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న 22ఏ భూముల సమస్య పరిష్కారం కోసం రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. అవనిగడ్డ రెవెన్యూ హాలులో శుక్రవారం జరిగిన ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి పాల్గొన్న కలెక్టర్ నియోజకవర్గంలో దాదాపు 10 వేలమంది రైతులు ఎదుర్కొంటున్న 22ఏ భూముల సమస్య గురించి ప్రస్తావించారు. భూముల సమస్య పరిష్కారం కోసం రైతులు కాగితాలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే క్రమపద్ధతిలో పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జీవో నెంబరు 30 ద్వారా క్రమబద్ధీకరణ జరిగిన ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ దస్తావేజులు, పట్టాలను కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతిదేవి, ఎంపీడీవో మరియదేవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన కలెక్టర్ బాలాజీ అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో ముఖాముఖీ మాట్లాడి ఆసుపత్రిలో వైద్యం సక్రమంగా అందుతుందా? మందులు అందిస్తున్నారా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

» ఐజీ అశోక్‌కుమార్



అవనిగడ్డ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

అవనిగడ్డ, డిసెంబబరు 5 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ స్టేషన్, డీఎస్పీ కార్యాలయాల్లో వార్షిక తనిఖీలు నిర్వహించిన ఐజీ అశోక్‌కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల అమ్మకాలను నిరోధించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నిఘా బృందాల నిరంతర పర్యవేక్షణతో మాదక ద్రవ్యాల వినియోగం గణనీయంగా తగ్గినట్టు ఐజీ వివరించారు. జిల్లాలో గతంలో కంటే క్రైమ్ రేటు గణనీయంగా తగ్గిందని, పాత రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని, సిబ్బంది కొరత త్వరలోనే పరిష్కారమవుతుందని ఐజీ వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీ విద్యశ్రీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మావోఇష్టులా?

(5వ పేజీ తరువాయి)

సమాచారాన్ని అందించారా? మావోయిస్టులకు కొరియర్లుగా ఉంటూ పోలీసులకు ఇన్ఫార్మర్లుగా మారారా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

మావోయిస్టులతో సంబంధాలెలా?

బెజవాడ వ్యాపారులకు మావోయిస్టు అగ్రనేతలతో ఎలా సంబంధాలు కుదిరాయన్నది చర్చగా మారింది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు తమ కొరియర్లుగా ఉండేవారినే విశ్వసిస్తారు. అది కూడా కొద్ది సంవత్సరాలు వారికి వేరే బాధ్యతలు అప్పగించి, వారి పనితీరును గమనించిన తర్వాతే నమ్మకాన్ని ఏర్పాటు చేసుకుని కీలక సమాచారాన్ని పంచుకుంటారు. తమ కదలికలకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఇస్తుంటారు. దేశంలోనే మోస్ట్ వాంటెడ్ హిడ్మా వంటి వారితో పరిచయాలు, సంబంధాలు అంటే ఆషామాషీగా ఉండదు. ఆ ప్రకటన మేరకు హిడ్మాను విజయవాడ తీసుకురావటంలో ఇద్దరు వ్యాపారులు కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. అలాంటపుడు మావోయిస్టులతో వీరికి ఎంతోకాలంగా పరిచయాలు, సంబంధాలు ఉండి ఉండవచ్చని తెలుస్తోంది. బిల్డర్-సివిల్ కాంట్రాక్టర్ ద్వారానే కానూరు ఆటోనగర్‌లో భవనం తీసుకుని ఉంటారా అనే.. అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో మాదిరిగానే..

నగరంలో 1990లో మావోయిస్టు సానుభూతిపరుడు, కొరియర్ అయినటువంటి సాయి ఉదంతం మూడున్నర దశాబ్దాల తర్వాత స్ఫురణకు వస్తోంది. సంచలనం సృష్టించిన ఎస్ఐబీ ఎస్ఐ ఇమ్మానియేల్ హత్య కేసును లోతుగా చూస్తే.. నక్సల్స్‌కు సానుభూతిపరుడిగా, కొరియర్‌గా ఉండి వారి చేతిలోనే సాయి చనిపోయాడు. నగరంలోని సాయి ఇంటికి వచ్చి ఎందరో నక్సల్స్ నేతలు భోజనంచేసి వెళ్లేవారు. కొందరు అక్కడే తలదాచుకునేవారు. అలా నక్సల్స్‌తో పరిచయం పెంచుకున్న సాయి ఆ పార్టీకి కొరియర్‌గా మారాడు. సాయిపై నమ్మకం పెంచుకోవటానికి నక్సల్స్ పార్టీకి రెండేళ్లు పట్టింది. సర్కార్ జిల్లాల కీలక నేత నిమ్మలూరి భాస్కరరావుకు కొరియర్‌గా సాయి పనిచేశాడు. ఆ నాలుగు నెలలకే నిమ్మలూరి పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై పార్టీ విచారణ జరిపి సాయి ద్వారా సమాచారం వెళ్లిందని తెలుసుకుంది. అతడిని నల్లమల అడవులకు పిలిపించి వాస్తవాలు రాబట్టారు. విజయవాడ ఎస్ఐబీలో పనిచేసే ఎస్ఐ ఇమ్మానియేల్ రాజు.. సాయిని తన ఆధీనంలోకి తీసుకుని కొరియర్‌గా తాను చేరవేసే లేఖలన్నింటినీ చదివేవాడని, తనకు పలుమార్లు ఆర్థిక సహాయం చేశాడని, తన కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించటం వల్ల సమాచారం చెప్పాల్సి వచ్చిందని సాయి ఒప్పుకొన్నాడు. ఆ తర్వాత నక్సల్స్.. సాయిని అడవుల్లోనే చంపేశారు. ఇమ్మానియేల్ రాజు దగ్గర ఉన్న కీలక సమాచారం వల్ల మనుగడకే ప్రమాదమని గ్రహించిన సర్కార్ జిల్లాల కమిటీ విజయవాడకు ప్రత్యేక ఆపరేషన్ బృందాన్ని పంపించి ఆయన్ను హత్య చేయించింది. ఇమ్మానియేల్ రాజు పుష్పా హోటల్‌లో పేపర్ చదువుతుండగా, కాల్చిచంపారు. తాజాగా మావోయిస్టు పార్టీతో బెజవాడ వ్యాపారుల హస్తం ఉందని తెలియడం, హిడ్మా వంటి కీలక నేతను ఎన్‌కౌంటర్ చేయడంతో మరోసారి బెజవాడపై మావోయిస్టులు కన్నుపడిందని తెలుస్తోంది.

వచ్చారు.. వెళ్లారు..

(5వ పేజీ తరువాయి)

వాటిపై ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో స్థానికులు పీసీసీఎఫ్‌కు అదే పనిగా ఫిర్యాదు చేయడంతో తనిఖీలకు ఆదేశించారు. తనిఖీలు చేయాలని పీసీసీఎఫ్.. రాజమండ్రి నుంచి ఫారెస్టు అధికారి శ్రీనివాసరావు నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను పంపారు. ఈ బృందం శుక్రవారం మెట్లపల్లి రిజర్వు ఫారెస్టుకు చేరుకుంది. గతంలో మూడు అక్రమ క్వారీలు ఉండగా, ప్రస్తుతం పది ఉన్నాయి. పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వుకుపోయిన విషయాలు బయటపడ్డాయి. అయితే, తనిఖీ బృందం ఎలాంటి కొలతలు తీసుకోలేదు. గుర్తించిన పది ప్రాంతాల్లో గ్రావెల్ గోతుల లోతు, పొడవు, వెడల్పును కొలిస్తే ఎన్ని క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తరలించుకుపోయారో తెలుస్తుంది. ఒక్కచోట కూడా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేయకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తనిఖీల సందర్భంలో స్థానికులు కూడా అక్కడి వచ్చి పరిశీలించారు. కొలతలు వేస్తేనే తవ్వకాల లెక్క తెలుస్తుంది కదా.. అని స్థానికులు ప్రశ్నించినా అధికారులు స్పందించలేదు. కాగా, స్థానికుల పరిశీలనలో కొత్తగా మరో 3 క్వారీలు తవ్వినట్టుగా తేలింది. ఈ విషయాన్ని కూడా స్క్వాడ్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, స్థానికులు కొందరు అటవీ శాఖ తనిఖీ బృందాన్ని కలిశారు. ఎక్స్‌కవేటర్లతో పనులు చేయించి కూలీలతో చేయించినట్టుగా డబ్బు డ్రా చేశారని, మస్తర్లు, ఓచర్ల స్కామ్‌లపై కూడా విచారణ చేయాల్సిందిగా కోరగా, వాటిని తర్వాత చూద్దామని చెప్పి అధికారులు వెళ్లిపోవడం గమనార్హం.

దళారుల దందా

(5వ పేజీ తరువాయి)

ఒకరు అన్నీతానై వ్యవహరిస్తూ ఈ పించన్ల పరిశీలనలో తెరవెనుక చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఆసుపత్రిలో పనిచేసే ఈ ఉద్యోగి ఏజెంట్ల ద్వారా పింఛన్ పరిశీలనకు వచ్చేవారితో బేరాలు ఆడుతున్నారు. పూర్తిస్థాయిలో వైకల్యం ఉన్నట్టుగా సర్టిఫికెట్లు ఇప్పిస్తానని, ఒక్కొక్కరు రూ.40 వేల నుంచి రూ.45 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని చెబుతున్న వారికి.. దివ్యాంగుల కోటాలో నెలకు రూ.6 వేల పెన్షన్ వస్తుందని, ఏడాదిలో ఏడెనిమిది నెలలు పింఛన్లు మీవి కాదనుకుంటే.. జీవిత కాలమంతా పింఛన్ పొందవచ్చని చెబుతున్నారు.

నేనే రాజు, నేనే మంత్రి..

మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో జరుగుతున్న పింఛన్ల పరిశీలనలో ఓ చోటా నాయకుడు హవా నడుపుతున్నాడు. ఆసుపత్రి వైద్యులు తాను చెప్పినట్టే వింటారని, తానే రాజు, తానే మంత్రినని చెబుతున్నాడు. ఈ విషయం అల్లరి కావడంతో ఆసుపత్రిలో పనిచేసే కొందరు వైద్యులు కొంతకాలంగా అతని సిఫార్సులను కొంతమేర పక్కన పెడుతున్నారు. దీంతో ఇతనికి నగదు ఇచ్చిన వారికి దివ్యాంగుల పింఛన్ వచ్చేలా సర్టిఫికెట్లు జారీకాలేదు. అయినా తనకున్న పరిచయాలతో దివ్యాంగుల పింఛన్లు ఇప్పిస్తానని చెప్పి నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇతనికి ఆసుపత్రిలో పనిచేసే సీనియర్ ఉద్యోగి సహకరిస్తుండటంతో వసూళ్లకు బ్రేక్ పడట్లేదు. ఈ చోటా నాయకుడికి అనుకూలంగా పనిచేసే ఆసుపత్రి వైద్యులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఇటీవల పలువురు ఫిర్యాదు చేశారు. ఈ చోటా నాయకుడి చేతిలో మోసపోయినవారు.. పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. పార్టీ పెద్దలు పిలిచి మందలించినా చోటా నాయకుడు వసూళ్లు ఆపకపోవడం గమనార్హం.

భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల ఆలయ ఉద్యోగులు మర్యాదగా వ్యవహరించాలని ఈవో వీకే శీనానాయక్ అన్నారు. శుక్రవారం దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై దేవస్థాన ఈవో, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ట్రస్ట్ బోర్డు సభ్యుడు బడేటి ధర్మారావులతో కలసి ఘాట్ రోడ్డులోని చెప్పుల స్టాండ్, క్లోక్ రూమ్ (వస్తువుల భద్రతా కేంద్రం), సెల్‌ఫోన్ కౌంటర్ల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేశారు. కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి, భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఎటువంటి ఫిర్యాదులకు తావు లేకుండా సేవలు అందించాలని సూచించారు.

26న చర్లపల్లి-నరసాపూర్‌కు రైలు సర్వీసు

రైల్వేస్టేషన్ : ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని ఈనెల 26న చర్లపల్లి-నరసాపూర్ మధ్య రైలు సర్వీసును నిర్వహిస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ శుక్రవారం 07140 నెంబరుతో చర్లపల్లి - నరసాపూర్ రైలు చర్లపల్లిలో రాత్రి 10.40కు బయలుదేరుతుంది. మరునాడు ఉదయం 9.45 గంటలకు నరసాపూర్ చేరుతుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకువీడు, భీమవరం, పాలకొల్లు స్టేషన్‌లలో మాత్రమే ఆగుతుంది. వన్ ఏసీ కమ్ టూ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ఏపీఐఎస్టీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దారం శామ్యూల్ ప్రసాద్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తూ సంఘ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని ఏపీఐఎస్టీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దారం శామ్యూల్ ప్రసాద్ నూతన కార్యవర్గానికి సూచించారు. బాపులపాడు హైస్కూల్ అవరణలో శుక్రవారం సునాధ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్ ఎన్నికల పరిశీలకుడిగా, గన్నవరం మండల అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఎన్నికల అధికారిగా మండల కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. మండల కార్యవర్గ అధ్యక్షుడిగా కె.వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా భరత్, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకులు తెలిపారు.

నేడు ఈడుపుగల్లులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంకిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడుపుగల్లు శివాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొంటారని, మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ పరిష్కార వేదికను సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, సీహెచ్‌సి డైరెక్టర్ రవి కిషోర్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, పార్టీ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ కుముదిని, ఐ.ఈ రిసోర్స్ టీచర్ దీప్తి

పారా స్పోర్ట్స్‌లో కంకిపాడు విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక విద్యార్థులకు నిర్వహించిన పారా స్పోర్ట్స్‌లో కంకిపాడుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చటం అభినందనీయమని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కుముదిని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శుక్రవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రత్యేక విద్యార్థులను భారంగా కాకుండా బాధ్యతగా చూడాలన్నారు. వారిలో కోల్పోయిన మనోధైర్యాన్ని బయటకు తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. కాళ్లు చేతులు పని చేయకపోయినా కొంత మంది తెలివి తేటలు అమోఘంగా ఉంటాయన్నారు. వారికి కావాల్సిన ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ. ఈ రిసోర్స్ టీచర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

పెనమలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని మహదేవపురంలో పేకాడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని, రూ. 2,26,000 స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం మహదేవపురం కాలనీ నాల్గవ లైన్‌లో కొంతమంది పేకాడుతున్నట్లు ఎస్సై రమేష్‌కు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 2.26లక్షల సొమ్మును, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. స్టేషను పరిధిలో కోడిపందేలు, పేకాట శిబిరాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.

కేసీపీలో చెరుకు క్రషింగ్ ప్రారంభం

ఉయ్యూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేసీపీ చక్కెర కర్మాగారంలో 2024-2025 సీజన్‌కు చెరుకు క్రషింగ్ యూనిట్ హెడ్ వై. సీతారామదాస్ గురువారం రాత్రి ప్రారంభించారు. కర్మాగారంలో యంత్రాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి స్విచ్ ఆన్‌చేసి క్రషింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో 3.20లక్షల టన్నుల చెరుకు గానుగాడనున్నామన్నారు. కేసీపీ సంస్థ స్థాపించి నాటి నుంచి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల చెరుకు రైతుల సంక్షేమం, అభివృద్ధికి తోడ్పడిందన్నారు. రైతు నాయకులు ఎస్‌వి కృష్ణారావు, వి.రత్నగిరిరావు, చాగంటి తిమ్మారెడ్డి, శివరామ్, మోహన్‌రెడ్డి, కేన్ జీఎం పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

13నుంచి ఆక్యుపంక్చర్ యోగాపై శిక్షణ

కానూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కానూరు అశోక్ నగర్‌లోని ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయంలో ఆక్యుపంక్చర్ యోగా విధానంపై ఈ నెల 13నుంచి 18వ తేదీ వరకు ఆరు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయం చైర్మన్, కోర్సు ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ మకాల సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం ఆయన కానూరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ, భారత ప్రభుత్వ ప్రోత్సాహంతో, భారత్ సేవక్ సమాజ్ (బీఎస్ఎస్) సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను బహూకరిస్తున్న డాక్టర్ సుధ, ప్రిన్సిపాల్ కృపావతి

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై అవగాహనతో సమాజం పట్ల గౌరవభావంతో ఉండాలని మెడివ్యాలీ డైరెక్టర్ డాక్టర్ సుధ సూచించారు. కానుమోలు చింతా సీతయ్య జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ కృపావతి పర్యవేక్షణలో శుక్రవారం మెడివ్యాలీ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాల పట్ల జాగత్తగా ఉండాలని సూచించారు. డాక్టర్ స్పందన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు ఈఎన్‌టీ, మధుమేహం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మిలి సూర్యనారాయణమూర్తి, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అత్యుత్తమ విద్యావిధానం

● ఎన్నారై రాంబాబు ప్రశంస

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతో కూడిన విద్యావిధానం, నోబ్యాగ్‌డే లాంటి వినూత్న పద్ధతులతో మన రాష్ట్రంలో అత్యుత్తమ విద్యావిధానం అమలవుతోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నారై తుమ్మల రాంబాబు విద్యార్థులకు సూచించారు. రంగన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం గుమ్మడి జాస్మిన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్, పీటీఎంలో ఎస్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఆర్ఆర్‌డీఎస్ ద్వారా సహకారమందిస్తామని ఆళ్ల గోపాలకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, పుసులూరి లక్ష్మీనారాయణ, నత్తా అబ్రహాం, కనకవల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.






యనమలకుదురు హైస్కూల్‌లో మాట్లాడుతున్న శొంఠి శివరాంప్రసాద్.. కంకిపాడులో తుమ్మలపల్లికి సత్కారం.. వేలేరు హైస్కూల్‌లో మాతృవందనం.. ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో ఆత్మీయ సమావేశం

విద్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి భేష్

ఎమ్మెల్యే బోడె ప్రసాద్




కానూరులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. గొల్లనపల్లి హైస్కూల్‌లో పీటీఎంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

కానూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కృషి భేష్‌గా ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కితాబిచ్చారు. కానూరులోని జడ్‌పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పీటీఎం సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాభివృద్ధిని విద్యార్థుల, తల్లిదండ్రులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల కన్వీనర్ అన్నే శివ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంకిపాడు : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని పునాది పాడు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లికి ఘన సత్కారం

కంకిపాడు జడ్పీ పాఠశాల అభివృద్ధికి టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ చేస్తున్న కృషి అభినందనీయమని హెచ్‌ఎం ఉమాదేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో తుమ్మలపల్లిని పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ అజ్గర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : మండలంలోని పలు పాఠశాలల్లో తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. పెనమలూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు టీడీపీ కూటమి ప్రభుత్వం అనేక రకాల వసతులు, కల్పిస్తోందని వక్తలు తెలిపారు. యనమలకుదురు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల చదువు పట్ల అత్యంత శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శేషు, బలగం కొండ, సజ్జ ఏడుకొండలు, ఏసురత్నం, నీలిమ, జోజయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కే దేవి, టీచర్లు బదరీనారాయణ, డి నీలిమ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో మాట్లాడుతున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరువరాదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు జడ్పీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎం 3.0 కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. సీఐ రామారావు మాట్లాడుతూ, విద్యార్థులపై సినిమాల ప్రభావం దుష్పరిణామాలకు దారితీస్తుందని, తమ పిల్లలు చేసే కార్యకలాపాల పట్ల తల్లిదండ్రులు అప్ర మత్తతో ఉండాలన్నారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఎస్ఎమ్‌సీ సభ్యులు శివసాయి ప్రసాద్, కౌన్సిలర్ వెంకటలక్ష్మిమ, కుటుంబ రాజు, కిషోర్, ద్విజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

● కడవకొల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 3.0 కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్‌వి శేషగిరిరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఉన్నం చిన్నారి, లక్ష్మణస్వామి, బాబూజి పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ చొరవతో విద్యావ్యవస్థలో పెనుమార్పులు

గన్నవరం : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపడుతున్న సంస్కరణల వల్ల విద్యారంగం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని గొల్లనపల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మెగా పీటీఎం కార్యక్రమం జరిగింది. హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్మించిన ఆరు కోర్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్య వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, సర్పంచ్ గణపవరపు శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, చిరుమామిళ్ళ సూర్యం, బోయపాటి మురళీకృష్ణ, బోడపాటి రవి, మేడేపల్లి రమ, యనమదల సతీష్, హెచ్‌ఎం కెఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గన్నవరం బాలుర హైస్కూల్‌లో ఇన్‌చార్జి సర్పంచ్ పాలడుగు నాని పాల్గొన్నారు. ముస్తాబాద కోనేరు ఎంపీపీ పాఠశాలలో పీఎస్‌సీఎస్ చైర్ పర్సన్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ పాల్గొని మాట్లాడారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థుల్లో లోపాలను సరిదిద్ది అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దేందుకు పీటీఎం(పేరెంట్స్, టీచర్స్ మీటింగ్) సద్వినియోగ పతుందని ఎంఈఓ2 విజయ్, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమావరప్రసాద్ వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. బాపులపాడు మండల వ్యాప్తంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి శుక్రవారం ఆహ్లాదకర వాతావరణంలో మెగా పీటీఎం నిర్వహించారు. వేలేరు హైస్కూల్ హెచ్‌ఎం విజయ్ పర్యవేక్షణలో విద్యార్థులు తల్లికి పాదపూజతో కూడిన వందనం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. అక్కినేని రాఘవేంద్రరావు, జెడ్పీటీసీ గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు. వీరవల్లి హైస్కూల్ ఇంచార్జి హెచ్‌ఎం చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కూడి తల్లిదండ్రులు, నాయకులు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ పిల్లా అనిత, లంక అజయ్, మండాది రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. పెరికీడు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం లీలాసుగుణ ఆధ్వర్యంలో ప్రవీణ్, ప్రమీలారాణి, కొత్తూరు ఆంజనేయులు, బండారు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. రామన్నగూడెం హైస్కూల్ హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు, నాయకులు సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. చైర్మన్ శ్రావణి, వడ్లమూడి నాని, జూపూడి బాలకృష్ణ,ముద్రబోయిన దాసు, తదితరులు పాల్గొన్నారు. కానుమోలు హైస్కూల్ హెచ్‌ఎం పద్మజ ఆధ్వర్యంలో పీఈటీ రామచంద్రుడు పర్యవేక్షణలో తల్లులకు మ్యూజికల్‌చైర్, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, పీఎసీఎస్ చైర్మన్ దన్నే దుర్గారావు, మాజీ సర్పంచ్ చింతల వెంకట శివఅప్పారావు, కాటుమాల గిరి, తదితరులు పాల్గొన్నారు. బాపులపాడు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, రేమల్లె హైస్కూల్ హెచ్‌ఎం లూథర్‌పాల్ ఆధ్వర్యంలో, మడిచర్ల, మల్లవల్లి హైస్కూళ్లలో, ఉమామహేశ్వరపురం, రేమల్లె, వీరవల్లి ఎంపీపీ స్కూళ్లలో మెగా పిటిఎం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు.

ఉంగుటూరు : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంయుక్త సహకారం అవసరమని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మూడవ మెగా పీటీఎం(తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం)కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 జె.సాంబశివరావు పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని కేసరపల్లిలో శుక్రవారం సాయంత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నియోజకవర్గం రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందని అధికారుల మంచి పనితీరు వల్లే ఇది సాధ్యమైంది అన్నారు. ప్రతి వారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో వచ్చే సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో రెండో స్థానం నుంచి మొదటి స్థానానికి చేరుకునేందుకు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్పెషలాఫీసర్ షాహిద్‌బాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ జాస్తి విజయభూషణ కుమార్, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, అన్నే హరికృష్ణ జనసేన నాయకులు చిమట రవివర్మ, తహసీల్దారు కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పెనమలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో బందరు రోడ్డు వెంట రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసేవారు, ఇతర కారణాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని పెనమలూరు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ హెచ్చరించారు. శుక్రవారం తన సిబ్బందితో కలిసి సీఐ తాడిగడప సెంటర్ నుంచి పోరంకి వరకు బందరు రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను జేసీబీ సాయంతో తొలిగించి ఆక్రమణదారులతో మాట్లాడారు. ఆక్రమణదారులపై భారీ జరిమానాలు విధించి కేసులు పెడతామని హెచ్చరించారు.



బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఉయ్యూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం, సామాజిక దురాచారమని ఆకునూరు సర్పంచ్ గోలి వసంత కుమార్ అన్నారు. మెగా పేరెంట్స్ డే, బాల్ వివాహ్ ముక్త్ భారత్ పురస్కరించుకుని వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని బాల్యవివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి ఎస్.సరళకుమారి, ప్రిన్సిపాల్ వివిఎస్‌బి రామలక్ష్మి, వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ పీవో ప్రశాంతి, పాఠశాల హెచ్‌ఎం సాగర్, అంగన్వాడీ సూపర్‌వైజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటుతో వృద్ధుడి మృతి



ఉయ్యూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉయ్యూరులో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఇందుపల్లికి చెందిన ముసునూరి కన్నయ్య (86) ఉయ్యూరు వచ్చి బ్యాంకులో పెన్షన్ డబ్బు డ్రా చేసుకుని సెంటర్‌లో ద్వారకాతిరుమల వెళ్లే బస్సు ఎక్కి సీటులో కూర్చుని వెళుతూ కొంతసేపటి తరువాత పక్కకు వాలిపోయాడు. గమనించిన ప్రయాణికులు కండక్టర్‌కు తెలియజేయడంతో ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుని జేబులో ఉన్న ఫోన్ ద్వారా అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కన్నయ్య వేపాండు స్కూల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా రిటైర్ అయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆలయాలు శక్తి కేంద్రాలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మంలోని విజ్ఞానాన్ని, వైశిష్ట్యాన్ని యువతకు తెలియజెప్పేలా ఆలయాలే శక్తి కేంద్రాలుగా సామూహిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. బండారుగూడెం రామాలయంలో పౌర్ణమి సందర్భంగా శివశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక హారతి పూజ నిర్వహించారు. డిసెంబరు 14వ తేదీ విజయవాడలో నిర్వహించే శివశక్తి దశవర్ష మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



హై లైఫ్ జ్యువెల్స్ ప్రదర్శిస్తున్న సినీ నటి అషురెడ్డి, మోడల్స్

నోవాటెల్‌లో హై లైఫ్ జ్యువెల్స్ ఎగ్జిబిషన్

● ప్రారంభించిన సినీ నటి అషురెడ్డి

విజయవాడ సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హై లైఫ్ ప్రీమియం జ్యువెల్స్ ఎగ్జిబిషన్‌కు విజయవాడ నగరంలోని నోవాటెల్ వేదికైంది. మూడు రోజుల పాటు జరిగే అగ్రశ్రేణి జ్యువెలరీ బ్రాండ్స్ ప్రదర్శనను సినీ నటి అషురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ఉన్న 75కి పైగా జ్యువెలరీ బ్రాండ్స్‌తో జ్యువెలరీ డిజైనర్‌లు ప్రదర్శనలో పాల్గొంటున్నారని హై లైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ, సీఈవో ఎ.బి.పి.డోమినిక్ వెల్లడించారు. డైమండ్, టెంపుల్, గోల్డ్, ప్లాటినం, ఫ్యాషన్, వెడ్డింగ్, పోల్కీ జ్యువెలరీతో పాటు మరెన్నో అద్భుతమైన ఆభరణ కళాఖండాలు ప్రదర్శనలో ఉంచుతున్నట్లు వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత డిజైన్‌ల సమూహాన్ని ఒకే వేదిక వద్దకు తీసుకొచ్చిన ఈ అవకాశాన్ని జ్యువెలరీ ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివారం వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. గతంలో థాయ్‌ల్యాండ్, దుబాయ్, దక్షిణాఫ్రికా, సింగ్‌పూర్, యుకే, యుఎస్, శ్రీలంక దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చామని తెలిపారు.




మాట్లాడుతున్న హీరో రోషన్ కనకాల, హీరోయిన్ మీనాక్షి

విజయవాడలో మోగ్లీ చిత్ర యూనిట్ సందడి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో మోగ్లీ చిత్ర యూనిట్ శుక్రవారం సందడి చేసింది. పార్వతీపురం అడవి నేపథ్యంలో రూపొందిన యాక్షన్, లవ్ స్టోరీ మోగ్లీ చిత్రమని, ఈ చిత్రం ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుందని హీరో రోషన్ కనకాల తెలిపారు. బెంజ్‌సర్కిల్ సమీపంలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలర్ ఫొటో లాంటి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన సందీప్ రాజ్ దర్శకత్వంలో తాను హీరోగా నటించడం గొప్ప అవకాశమన్నారు. పార్వతీపురం, పాడేరు అటవీ ప్రాంతంలోని అందమైన ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగిందన్నారు. సంగీత దర్శకుడు కాలభైరవ చక్కటి సంగీతాన్ని అందించారని, నిర్మాతలు విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఖర్చుకు వెనుకాడకుండా చిత్రాన్ని నిర్మించారన్నారు. హీరోయిన్ మీనాక్షి అభినయం అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. హీరోయిన్ మీనాక్షి మాట్లాడుతూ రోషన్ తనకు ఎంతో సహకరించారన్నారు.

గుడివాడ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే వెనిగండ్ల వినతి



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. గురువారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికల ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా శ్మశాన వాటికల ఏర్పాటు కోసం పట్టణంలో 10 ఎకరాలు, నియోజకవర్గ వ్యాప్తంగా అవసరమైన ప్రధాన ప్రాంతాల్లో మరో 35 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదనలు అందించామన్నారు. ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ పైలెట్ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను ముఖ్యమంత్రికి వివరింరు. యూనిక్ ఐడీలపై రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామి ఇచ్చినట్లు తెలిపారు. బస్టాండ్ సెంటర్ నుంచి నాగవరప్పాడు సెంటర్ వరకు రోడ్డు అభివృద్ధికి మంజూరైన రూ.17.95 కోట్లు నిధులను విడుదల చేయాలని జాతీయ రహదారుల సంస్థ ఈఈ శశాంక్‌ను కలిసి కోరినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు.




దేశాయిపేట మునిసిపల్ హైస్కూల్‌లో పీటీఎం సమావేశంలో డీఈవో పి.వి.జె.రామారావు, బండి రామకృష్ణ తదితరులు

పిల్లల చదువుపై తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలి

● పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో డీఈవో పి.వి.జె.రామారావు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత వహిస్తే ఉన్నత స్థితికి ఎదగగులుగుతారని డీఈవో పి.వి.జె. రామారావు అన్నారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు జరిగాయి. మచిలీపట్నం దేశాయిపేట మునిసిపల్ హైస్కూల్‌లో డీఈవో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థుల బాగోగులను విచారించాలన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, యోగా నేర్పాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, ప్రముఖ న్యాయవాది పుప్పాల ప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఫిరోజ్, కొండా, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోబోటిక్స్, ఏఐలపై అవగాహన పెంచుకోవాలి



ఉంగుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ప్రాజెక్టులపై అవగాహన పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఏఐ విభాగాధిపతి కె.ఎన్.వి సత్యశ్రీ అన్నారు. ప్రాజెక్టుల రూపకల్పనలో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్-వీల్స్ ఆన్ మొబైల్ ల్యాబ్ బస్సు శుక్రవారం కళాశాలకు విచ్చేసింది. కళాశాలలోని వివిధ బ్రాంచ్‌ల విద్యార్థులకు ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పరిశ్రమ సంబంధిత సాధనాలపై అవగాహన కల్పించారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



విజయవాడ నలంద కళాశాల విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శన



దేశభక్తిని చాటేలా దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల విద్యార్థుల గిరిజన నృత్య ప్రదర్శన



మారిస్ స్టెల్లా కళాశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కృష్ణాతరంగ్ అదుర్స్



గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

● అలరించిన నృత్యప్రదర్శనలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో కృష్ణాతరంగ్ రెండో రోజు శుక్రవారం సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. జానపద నృత్యాలు కనువిందు చేశాయి. విద్యార్థుల్లోని కళాత్మకతను చాటాయి. సీనియర్ కళాకారులను తలపించేలా నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు ప్రభోదాత్మకంగా ఉన్నాయి. శాస్త్రీయ సంగీత కచేరీలు వీనులవిందు చేశాయి. రంగవల్లుల పోటీల్లో వర్సిటీ ప్రాంగణాన్ని రంగులతో ముంచెత్తారు. విజయవాడ నలంద కళాశాల విద్యార్థులు జానపద నృత్యంలో రౌద్ర రసాన్ని ప్రదర్శించారు. విజయవాడ దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా, మారిస్ స్టెల్లా కళాశాల విద్యార్థులు జానపద నృత్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. గుడివాడ ఏఎస్ఆర్ కళాశాల విద్యార్థుల గిరిజన నృత్య ప్రదర్శన ప్రత్యేకతను చాటింది. విజయవాడ ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థులు సంప్రదాయ కోలాటం ప్రదర్శన చేశారు.



దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల విద్యార్థుల నృత్య విన్యాసం

● ప్రతిభను చాటిన విద్యార్థులు

సాంస్కృతి కార్యక్రమాలతో విద్యార్థులు సందడి సందడి చేశారు. వినూత్న రీతిలో జరిగిన కృష్ణాతరంగ్ ప్రత్యేకతను సంతరించుకుంది. వీసీ కూన రాంజీ, ప్రొఫెసర్లు, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. రిజిస్ట్రార్ ఎన్. ఉష, రెక్టార్ ఎం.వి. బసవేశ్వరరావు, కో-ఆర్డినేటర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలు తిలకిస్తున్న వీసీ కూన రాంజీ, ఎం.వి. బసవేశ్వరరావు, దిలీప్ తదితరులు

వినయం, విధేయత ఉంటేనే అన్ని రంగాల్లో రాణింపు

● నేషనల్ లీగల్ ఫెస్ట్‌లో జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు



సిద్దార్థ లా కళాశాలలో లీగల్ ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు

కానూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎంతటి నైపుణ్యం పొందినప్పటికీ కూడా వినయం, విధేయతలు ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు అన్నారు. కానూరు లోని శ్రీమతి వెలగపూడి దుర్గాంబ సిద్దార్థ న్యాయ కళాశాలలో మూడు రోజులు పాటు జరిగే జస్టిస్ చల్లా కొండయ్య మెమోరియల్ సిదార్థ 4వ నేషనల్ లీగల్ ఫెస్ట్-2025 శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. జస్టిస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ, ప్రతి ఒక్కరికీ వృత్తిపట్ల విధేయత, అంకితభావం ఉండాలన్నారు. న్యాయ విద్యార్థులకు మూట్ కోర్టు (మాక్ కోర్టు) మంచి అవకాశమన్నారు. న్యాయస్థానాల్లో ఉపయోగించే ఆర్గ్యుమెంట్, డ్రాఫ్ట్ రైటింగ్ స్కిల్స్ అలవడతాయన్నారు. సిద్ధార్థ లా కళాశాల జాతీయ స్థాయి మూట్ కోర్టులనే గాకుండా అంతర్జాతీయ స్థాయి మూట్ కోర్టులను నిర్వహించాలని ఆశిస్తున్నట్లు జస్టిస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ న్యాయ విద్య నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇలాంటి లీగల్ ఫెస్టులు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు మాట్లాడుతూ, న్యాయ విద్యార్థులు వృత్తిపరంగా అభివృద్ధి చెందడానికి ఇలాంటి ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సిద్దార్థ న్యాయ కళాశాల కన్వీనర్ పర్వతనేని ప్రభాస్, సిద్ధార్థ వర్సిటీ వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను కారు ఢీకొని యువకుడి దుర్మరణం

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : షేర్ మహ్మద్‌పేట శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన బాలబోయిన వినయ్ (23) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గోవర్ధన్, రమాదేవి కుమారుడు వినయ్ వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ కొన్నారు. వాహన పూజ నిమిత్తం శుక్రవారం తిరుమలగిరి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వస్తుండగా కొత్త ట్రాకర్టర్‌ను టీఎస్ 31టీ కారు వెనక నుంచి ఢీకొట్టింది. శంషాబాద్ విమానాశ్రయం నుండి బంటుమిల్లి సమీపంలోని సాతులూరు వెళ్తున్న కారువెనుకగా ఢీకొనటంతో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో వినయ్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అమెరికా నుంచి వస్తున్న చోడవరపు రాధాకృష్ణ షంషాబాద్ విమానాశ్రయం వద్ద టీఎస్ 31 టి 3894 క్యాబ్ బుక్ చేసుకుని అన్న కుమారుడితో కలిసి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఈ ప్రమాదంలో రాధాకృష్ణకు స్వల్ప గాయాలు అయ్యాయి. క్యాబ్ డ్రైవర్ పరారయ్యాడు. వినయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి తరలివచ్చారు. మొక్కుబడి తీర్చుకునేందుకు బయలుదేరిన కుమారుడు తన కళ్ల ముందే మృతి చెందటంతో తల్లిదండ్రుల కన్నీరు మున్నీరయ్యారు. వినయ్ అయ్యప్ప మాల ధరించి శబరిమల వెళ్లాడు. శుక్రవారం గ్రామానికి రావాల్సి ఉండగా ఒక్కరోజు ముందుగా గురువారమే ఇంటికి వచ్చారు. వాహన పూజ చేయించేందుకు ట్రాక్టర్‌ను తీసుకుని బయలుదేరి మృత్యువాత పడినట్లు బంధువులు తెలిపారు.

గుడివాడ పోస్టాఫీసు, ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ధర్నా



గుడివాడ పోస్టాఫీసు, ఉంగుటూరు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పోస్టల్ ఖాతాదారులు

ఉంగుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలు మోసపోయిన పోస్టల్ ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు శుక్రవారం గుడివాడ హెడ్‌పోస్టాఫీసు, ఉంగుటూరు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయని పైసాపైసా కూడబెట్టుకుని పోస్టాఫీసులో పేదలు దాచుకున్న సుమారు రూ.50 లక్షల సొమ్మును పోస్టమాస్టర్, పోస్ట్‌మెన్ నకిలీ పాస్‌పుస్తకాలు సృష్టించి దోచుకున్నారన్నారు. విజిలెన్స్ అధికారులు కూడా ఈ అవకతవకలు గుర్తించకపోవడం శోచనీయమన్నారు. పోస్టమాస్టర్ కె. దేవేంద్రరావు విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వుండటం వల్లనే పోస్ట్‌మేన్ శేఖర్ ఘరానా మోసానికి పాల్పడ్డాడన్నారు. గల్లంతైన సొమ్ముకు ఇరువురినీ బాధ్యులను చేయాలని, వారి నుంచి సొమ్ము రికవరీచేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.

బాధితుడు చిట్టూరి రమేష్ మాట్లాడుతూ పోస్ట్‌మేన్ శేఖర్‌కు తనపేరు మీద రూ.10 లక్షలు, తన భార్య వరలక్ష్మి పేరు మీద రూ.12 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశామని, పొదుపుఖాతాల్లో కూడా ఇరువురి పేరుమీద ప్రతినెలా డబ్బులు చెల్లించేవారమని తెలిపారు. సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు టీవీ లక్ష్మణస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌సీపీ రెడ్డి, అజ్మీర వెంకటేశ్వరరావు, బాధితులు పాల్గొన్నారు.

ఉంగుటూరు పీఎస్ ఎదుట బాధితుల ఆందోళన

లక్షలాది రూపాయల సొమ్మును స్వాహా చేసిన పోస్ట్‌మేన్ శేఖర్, పోస్ట్‌మాస్టర్ దేవేంద్రరావులపై తక్షణ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ బాధితులు శుక్రవారం సాయంత్రం ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.

పోస్ట్‌మేన్ శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఎస్సై యు.గోవిందు మాట్లాడుతూ రెండు రోజుల్లో పోస్ట్‌మేన్‌ను కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు. సీపీఎం నాయకులు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు బాధితులకు మద్దతుగా నిలిచారు.

శ్రీవారి పవిత్రతను దెబ్బతీస్తున్న జగన్

● మాజీ మంత్రి దేవినేని ఉమా ధ్వజం



గొల్లపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పవిత్రతను మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాడని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీవారికి ఇచ్చిన కానుకలు కోట్లు కొట్టేసి దాన్ని చిన్న చోరీగా పేర్కొంటూ భక్తుల మనోభావాలను జగన్ దెబ్బతీస్తున్నాడని, ఏదో గుడి.. ఏదో లడ్డూ అంటూ శ్రీవారి పవిత్రతను, భక్తుల నమ్మకాన్ని అపహాస్యం చేసేలా వ్యాఖ్యలు చేస్తున్నాడని దేవినేని ఉమా ఘాటుగా వ్యాఖ్యానించారు.జగన్ అబద్ధాల ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. జగన్ డిక్షనరీలో నిజాయితీ, చిత్తశుద్ధి అనే పదాలు ఉంటే శాసనసభకు వచ్చి మాట్లాడేవాడని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఓటమిపై పశ్చాత్తాపం లేకుండా తప్పుడు ప్రచారాలతో జగన్ రాష్ట్ర అభివృద్ధికి బ్రేకులు వేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. ప్రజల తీర్పును అంగీకరించకుండా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నంలో జగన్ ఉన్నాడన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ కట్టని జగన్ నేడు ముసలి కన్నీరు కారుస్తున్నాడని ఎద్దేవా చేశారు.

కేయూలో స్పాట్ అడ్మిషన్లు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు ఈనెల 8న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎల్.సుశీల తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రవేశించేందుకు అడ్మిషన్ టెస్టుకు హాజరు కాని వారు, అర్హత సాధించని వారు కూడా ఈ అడ్మిషన్లకు అర్హులేనన్నారు. 8న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

డీఎడ్ మూడో సెమిస్టర్ పరీక్షలు 15వ తేదీకి వాయిదా

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డీఎడ్ పరీక్షలు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారని డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. టెట్ పరీక్షలు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా డీఎడ్ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్స్ ఈ మార్పును విద్యార్థులకు తెలియచేయాలన్నారు.

దివిసీమలో సంస్థాగత తలనొప్పి

● కొత్త వారికి అవకాశం ఇవ్వాలని లోకేశ్ సూచన
● భారీగా పెరిగిన టీడీపీ ఆశావహులు
● ఎంతకీ ముడిపడని మండల కమిటీలు

దివిసీమలో పార్టీ సంస్థాగత ఎన్నికలు అధిష్ఠానానికి తలనొప్పిగా తయారయ్యాయి. అవనిగడ్డ నియోజకవర్గం టీడీపీ కంచుకోటలాంటిది. వైసీపీ పాలనలో ఐదేళ్లు అణచివేతను పార్టీ శ్రేణులు సమర్థంగా ఎదుర్కొన్నాయి. పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతో పార్టీలో జోష్ నెలకొంది. అయితే, ఈసారి పాత నేతల స్థానంలో సంస్థాగత పదవుల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని మంత్రి నారా లోకేశ్ చేసిన సూచనను పొలిట్‌బ్యూరో ఆమోదించింది. పార్టీ పదవులపై ఆశావహులు పెరిగిపోవడం ఇప్పుడు అధిష్ఠానాన్ని ఇరకాటంలో పెట్టిన అంశం.

(ఆంధ్రజ్యోతి - అవనిగడ్డ)

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశించిన మేర గుర్తింపు లభించక అసంతృప్తితో ఉన్న తెలుగు తమ్ముళ్లుసంస్థాగత ఎన్నికలపై ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండల పార్టీల అధ్యక్షులు పదేళ్లకు పైగా మండల పార్టీ అధ్యక్ష పదవిలో ఉన్న వారే కావటంతో వారి స్థానంలో కొత్తవారికి అవకాశం లభిస్తుందని మండలాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మండల పార్టీ అధ్యక్ష పదవిని కైవసం చేసుకునేందుకు ఎవరికివారు తమ తమ మద్దతుదారులతో ప్రయత్నాలను తీవ్రతరం చేసి పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నారు.

అవనిగడ్డలో 2014 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వచ్చిన యాసం చిట్టిబాబుకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించగా, పదేళ్లపాటు ఆయనే అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఈసారి మండల పార్టీ అధ్యక్షుడిని మార్చే అవకాశం ఉండటంతో బుద్ధప్రసాద్‌కు అత్యంత సన్నిహితుడైన మాజీ ఎంపీపీ బండే నాగవెంకట కనకదుర్గ భర్త బండే రాఘవ, మాజీ సొసైటీ అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నేత పర్చూరి దుర్గాప్రసాద్ పోటీపడుతున్నారు. కోడూరు మండలంలో బండే శ్రీనివాసరావు దాదాపు 30 సంవత్సరాలుగా పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తూ ఉండటంతో ఈసారి ఆయనస్థానంలో మరొకరిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. బండే శ్రీనివాసరావు వర్గం నుంచే మరొక వ్యక్తిని నియమించటం జరుగుతుందని భావిస్తున్నారు. నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో ఎక్కడికక్కడ ముగ్గురు నలుగురుకు పైగా మండల స్థాయి నేతలు పోటీపడుతున్నారు. ఘంటసాల మండలానికి తుమ్మల చౌదరిబాబు కూడా మూడు దశబ్దాలపాటు అధ్యక్షునిగా ఉండగా, అక్కడ కూడా మండల పార్టీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగే పరిస్థితి కనిపిస్తోంది. అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో మాత్రం మండల పార్టీ అధ్యక్షుడి ఎన్నిక రసవత్తరంగా మారనుంది.



పార్టీ శ్రేణుల అభిప్రాయం తెలుసుకుంటున్న పరిశీలకుడు మంతెన రామరాజు

మోపిదేవిలో అభిప్రాయ సేకరణ

మోపిదేవి : టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల పార్టీ అధ్యక్షుల నియామకంపై ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం మోపిదేవిలో నిర్వహించారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధి లోని ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, కోడూరు మండల పార్టీల అధ్యక్షులు ఎన్నికలకు సంబంధించి ఆయా మండలాల నుంచి విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, ఆయా మండలాల నుంచి విచ్చేసిన గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ కమిటీ క్లస్టర్ ఇంచార్జ్‌ల నుంచి వ్యక్తిగతంగా అభిప్రాయ సేకరణ చేశారు. పార్టీ జాతీయ నాయకత్వం సూచనల మేరకు వ్యక్తిగతంగా అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు తెలిపారు. వారి అభిప్రాయాలను నివేదికరూపంలో రాష్ట్ర నాయకత్వానికి పంపటం జరుగుతుందని తెలిపారు.

సమస్యలు ఏకరువు

మోపిదేవి : సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు ఎదుట ఆయా మండలాలకు నాయకులు, కార్యకర్తలు సమస్యలను ఏకరువు పెట్టారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు ఏ విధ మైన పనులు జరగటం లేదని తెలిపారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలాల పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, మోర్ల రాం బాబు, నడకుదుటి జనార్ధనరావు, బండే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు తప్పవు

పామర్రు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజలకు వైద్యం నిర్వహిస్తే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి. యుగంధర్ హెచ్చరించారు. పామర్రు పరిధిలోగల ఆర్ఎంపీ వైద్యశాలలను శుక్రవారం ఆయన ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ఆరు ఆర్ఎంపీ వైద్యశాలలను గుర్తించి తక్షణమే మూసి వేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం సంబంధిత ఆర్ఎంపీ వైద్యులకు సంజాయిషీ నోటీసులను ఆయన జారీచేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్ఎంపీ వైద్యశాలలను తనిఖీ చేస్తున్న యుగంధర్



పెయ్యిదూడలను పరిశీలిస్తున్న అధికారులు

పశు సంపదను వృద్ధి చేసుకోవాలి

పెదపారుపూడి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పశుసంపదను వద్ధి చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ గుడివాడ డివిజన్ ఉపసంచాలకులు సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం యలమర్రు పశు సంవర్థక ప్రాంతీయ ఆసుపత్రి పరిధిలోని జనార్దనపురం, భూషణగుళ్ళ, వానపాముల ఉపకేంద్రాలను సందర్శించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు. సహాయ సంచాలకులు నరసింహారావు పాల్గొన్నారు.



దాతలను సత్కరిస్తున్న ఈవో హరి దుర్గా నాగేశ్వరరావు

ఆలయ పునః నిర్మాణానికి విరాళం

తోట్లవల్లూరు: పెనమకూరులోని చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థాన పునఃనిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ సూరపనేని వెంకటేశ్వరరావు, ఆయన సోదరుడు సుబ్రహ్మణ్యం రూ.50 లక్షల విరాళాన్ని ఆలయ ఈవో హరి దుర్గా నాగేశ్వరరావుకి అందించారు. చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో శుక్రవారం ఆలయం పునఃనిర్మాణానికి విరాళాలు అందించేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో రూ.50 లక్షలను తాము అందిస్తున్నట్టు వెంకటేశ్వరరావు బ్రదర్స్ తెలిపారు. వీరినుంచి అగ్రిమెంట్ పత్రాన్ని ఈవో రాయించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, నియోజకవర్గ ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నైతిక విలువల విద్య అవసరం

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల, వర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను నేర్పించడం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, డీవైఈవో కొండ మురళీ, బాలాజీ, రజిని పాల్గొన్నారు.

పమిడిముక్కల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపు, పాఠశాలల్లో విద్యనభ్యసించే బడుగు, బలహీనవర్గాల పిల్లలకు విలువలు, నాణ్యతతో కూడిన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మెగా పేరెంట్స్ డే 3.0 పురస్కరించుకుని తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, తలితండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన సైన్స్‌ఎగ్జిబిషన్ తిలకించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మొగాపేరెంట్స్ డే 3.0 హెచ్ఎం వేణుగోపాలరావు పాల్గొన్నారు.



మొవ్వ జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై శిరీష

కూచిపూడి : మోగా పేరెంట్స్ డే 3.0 పురస్కరించుకుని మొవ్వ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కూచిపూడి ఎస్సై పి.శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ పూర్ణచంద్రరావు, పాఠశాల హెచ్ఎం ఉమశ్రీ, ఏఎంసీ చైర్మన్ దోనెపూడి శివరామయ్య, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జె.బాబూరావు, కోటేశ్వరరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

గుడివాడ : మెగా పేరెంట్స్ 3.0 సమావేశాలను శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ముస్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక 18వ వార్డులోని ఏకేటీపీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ఓల్డ్‌టౌన్ ఉన్నత పాఠశాలలో మొగా పేరెంట్స్ డే 3.0 కార్యక్రమం నిర్వహించారు. కోటి పాల్గొన్నారు.



సైన్స్‌ఫెయిర్ తిలకిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పామర్రు : నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగాపేరెంట్స్ సమావేశంలో ఎంపీపీ దాసరి అశోక్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్సై సత్యకళ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

పెదపారుపూడి : మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎంపీడీవో విమాదేవి పాల్గొన్నారు.



పామర్రులో జ్యోతి ఎలిగిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్



గంగాధరపురం జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచాలి

గుడివాడ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మంచి తెలివి, చురుకైన విద్యార్థులని ఉపాధ్యాయులు ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని గూడూరు తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మీ అన్నారు. గంగాధరపురం జడ్పీ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ తరగతిలో పాసైన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానం వచ్చిన విద్యార్థులకు 10 వేల నగదు బహుమతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పి.ఎస్.నాగేశ్వరరావు, ప్రముఖులు ఉపదృష్ట రాంబాబు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన అవసరం

● శాస్త్రవేత్త జి.సురేఖ



భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జి.సురేఖ

గుడివాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మట్టిఆరోగ్యం, భూసార విశ్లేషణ, శాస్త్రీయ వ్యవసాయ సాంకేతికతల ప్రాధాన్యతపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ప్రయోగశాల శాస్త్రవేత్త జి.సురేఖ అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం స్వచ్ఛమైన మట్టి-స్థిరమైన భవిష్యత్తు అనే థీమ్‌లో భాగంగా శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులోని వ్యవసాయశాఖ భూసారపరీక్షా కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ, పోషక పదార్థాల విశ్లేషణ, పీహెచ్ విలువల నిర్ధారణ, ఆర్గానిక్ కార్బన్ అంచనా వంటి కీలక ప్రయోగ విధానాలను వివరించారు. ఈ సందర్భనలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, వ్యవసాయ అధికారి సాయిశ్రీనాథ్, ఫ్రాన్సిస్, సంధ్య భవాని, పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, రసాయన శాస్త్ర అధ్యాపకులు కె.సుధాకర్, టి.పద్మ, పి.లక్ష్మీదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్న గుంతలు లేని రహదారులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బైపాస్‌రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2.50కోట్ల వ్యయంతో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నామన్నారు. త్వరలోనే రహదారికి ఇరువైపులా రూ.1.50కోట్లతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించినున్నట్లు ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలనాళ్లలోనే రూ.60లక్షల నిధులతో రహదారికి మరమ్మతులు చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సహకారంతో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణాలు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఆర్అండ్‌బీ డీఈ కామేశ్వరరావు, ముస్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఆర్అండ్‌బీ అధికారులు రామస్వామి, మహేష్, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గుడ్లవల్లేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దశమ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం డోకిపర్రు భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణ వేడుకలు కనులపండువగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులకు వేదపండితులు చక్రస్నానం, అభిషేకాలు, కోనేటి స్నానం చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు శ్రీవారి పాదసేవకు ప్రత్యేక ఏర్పాట్లను నిర్వాహకులు పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డిలు ఏర్పాటు చేశారు. మహాక్షేత్రం అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయ మడ వీధుల్లో మండపాలను ఆలయ ధర్మకర్త సుధారెడ్డి ప్రారంభించారు. దక్షిణ రాజగోపురంలో కృతాయుగాన్ని తెలిపే ప్రహ్లాద సహిత నారసింహస్వామి ప్రణవానంద మండపాన్ని ప్రారంభించారు.పచ్చిమ రాజగోపురంలో త్రేతాయుగాన్ని తెలిపే శ్రీరామచంద్రుని కొలచే శ్రీమానసానంద మండపం ఏర్పాటు చేశారు. ఉత్తర భాగాన రాజగోపురంలో ద్వాపర యుగాన్ని సూచించే శ్రీకృష్ణసుధా మండపాలను అయన ప్రారంభించారు. తూర్పు భాగంలో భక్తులకు మోక్షమార్గాన్ని ప్రసాదించే గజేంద్ర మోక్షంతో కూడిన పరమాత్ముని మండపాన్ని ఏర్పాటుచేసి ప్రారంభించారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ సాలకట్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఏకాంత సేవతో ముగిశాయి. ధర్మకర్త సుధారెడ్డి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ, పీ.నాగిరెడ్డి, ప్రసన్న దంపతులు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



డోకిపర్రులో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తపస్వీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

పమిడిముక్కల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తపస్వీ ఫౌండేషన్ చేపడుతున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తపస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణాపురంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామంలో చిన్నారులకు ఫౌండేషన్ తరఫున స్కూల్ ఫీజులు చెల్లించడం, స్కాలర్‌షిప్‌లు అందించడం, గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూసేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు.



సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న సతీష్ కుమార్

ఘనంగా సెమీ క్రిస్మస్

గుడివాడ : దేవాది దేవుడైన ఏసుక్రీస్తు కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు దైవజనులు డాక్టర్ పి.సతీష్ కుమార్ ఆకాంక్షించారు. మల్లాయిపాలెంలోని కల్వరి టెంపుల్‌లో కల్వరి గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు జగన్మోహనరావు పాల్గొన్నారు.

పెదపారుపూడి : చినపారుపూడిలో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరయ్యారు. తొలుత సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ సందేశాన్ని తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు : జాతీయ సదస్సులో గుడ్లవల్లేరు వీవీఐపీఎస్ ఫార్మసీ విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. విజయవాడ కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మాస్యూటికల్ కళాశాలలో బయోఫార్మాస్యూటికల్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, నానో కారియర్ డిజైన్ ఫర్ ఎంజీమ్ బేసిడ్ సైటోటాక్స్ థెరప్యూటిక్స్ ఇన్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో తమ బీ.ఫార్మసీ విద్యార్థులు ఎస్.కార్యహర్షిత ప్రథమ, పి.చిన్నారి ద్వితీయ, డి.సంకీర్తిన తృతీయ బహుమతులు వివిధ విభాగాల్లో సాధించి విజేతలుగా నిలిచాన్నారు. విజేతలను కళాశాల యాజమాన్యం అభినందించారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

గుడ్లవల్లేరు : స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా గుడ్లవల్లేరులో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. వీధుల్లో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ తిరుగుతూ తడి, పొడి వ్యర్థాల సేకరణ చేశారు. తడి పొడి వ్యర్థాలు వేర్వేరుగా ఇచ్చేవిధంగా గృహస్థులకు అవగాహన కల్పించారు. పనులను పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న నిర్వాహకులు అభినందనీయులని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. శంకర్ నేత్రాలయ (పుట్టపర్తి) ఆధ్వర్యంలో కోసూరులో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న వైద్యసేవలు పరిశీలించారు. కృష్ణమోహన్, రాజ్యలక్ష్మీ దంపతులు, వేములమడ లక్ష్మీ పెరుమాళ్ల ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాస సురేష్‌బాబు కుటుంబ సభ్యుల సహకారంతో వారం రోజులపాటు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించటంతో పాటు కంటి శుక్లముల , కంటిపొర సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, సన్‌ఫ్లవర్ విద్యాసంస్థల అధినేత ఎండీవీఎస్.ఆర్.పున్నంరాజు తదితరులు పాల్గొన్నారు.



కోసూరులో వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

విద్యార్థులకు ఏఐపై అవగాహన తప్పనిసరి




సమావేశంలో మాట్లాడుతున్న కరుణ కుమార్

గుడివాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : యువత చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణిస్తూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై అవగాహన కలిగి ఉండాలని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ 2047 అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ చైర్మన్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సతీష్‌చంద్ర, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యలమంచిలి నాగేశ్వరరావు, గుళ్లపల్లి కిరణ్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ ముళ్లపూడి రమణమూర్తి, పూర్వ అధ్యక్షుడు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీహెచ్‌లో గర్భిణుల నమోదు తప్పనిసరి

● కిల్కారి ప్రోగ్రాం అధికారి రాజు

గుడివాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : సకాలంలో గర్భిణుల వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని కిల్కారి ప్రోగ్రాం అధికారి రాజు పేర్కొన్నారు. స్థానిక బాపూజీనగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు కిల్కారి కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిల్కారిలో నమోదైన గర్భిణులకు నాలుగో నెల ప్రారంభం నుంచి బిడ్డకు సంవత్సరం వచ్చేవరకు నెలకు ఒకపర్యాయం వాయిస్‌కాల్ ద్వారా సమాచారం అందించనున్నామన్నారు. కిల్కారి కాల్ వచ్చే నెంబరు 911 600 40 3660ను గర్భిణులు, బాలింతలు తమ మొబైల్ ఫోన్‌లలో సేవ్ చేసుకోవాలన్నారు. మరోసారి ఈ సమాచారాన్ని వినాలంటే 14423 లేదా 1800 532 1255 అనే టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాన్ డేవిడ్ ట్విన్సన్, సీవో రామారావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న రాజు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కూచిపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్ పేర్కొన్నారు. నిడుమోలు పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. మురుగుగుంటల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా తగు సూచనలు తీసుకోవాలని కోరారు. ఎంపీహెచ్ఈవో కె.వి.ఎస్.శంకరరావు, ఏఎన్ఎం నాగమణి, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

పెదపారుపూడి : మండలంలోని పెదపారుపూడి, పెద్దమద్దాలి, యలమర్రు గ్రామాల్లోని రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని తహసీల్దార్ శ్రీనునాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున ధాన్యాన్ని ఎండబెట్టి తేమ శాతం తగ్గేలా చూడాలన్నారు. రానున్న 10రోజుల్లో సంచుల సరఫరా చేసి .ధాన్యం రవాణ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీనివాసరావు, రైతులు చెరుకూరి విజయకుమార్ పాల్గొన్నారు.

తల్లిపై కుమారుడి దాడి .. కేసు నమోదు

గుడివాడ : స్థానిక యానాదుల కాలనీకి చెందిన జీబు నాగమణి పింఛన్ డబ్బులివ్వలేదని శుక్రవారం ఆమె కుమారుడు జీబు గణేష్ చెక్కపీటతో దాడి చేయగా, తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం నాగమణిని ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై పి.లోవరాజు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడులు

పామర్రు : స్థానిక శివాలయంలోని అయ్యప్ప ఆలయప్రాంగణంలో అయ్యప్పస్వామి ఇరుముడుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శబరిగిరిలో కొలువైయున్న హరిహర పుత్రుడు అయ్యప్ప దర్శనార్థం వెళ్లేందుకు దీక్ష స్వీకరించిన అయ్యప్ప భక్తులు గురుస్వాములతో ఇరుముడులును శుక్రవారం కట్టించుకున్నారు. నారా శ్రీను(బిందెలస్వామి) గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టారు. అయ్యప్ప నామస్మరణలతో ఆలయప్రాంగణం మార్మోగింది. పట్టణ పురవీధుల్లో శరణుఘోషలతో దీక్షాపరులు ఊరేగింపు నిర్వహించి బృందంగా శబరిగిరికి ఇరుముడులు ధరించి బయలుదేరారు. విచ్చేసిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. బంధువులు, స్నేహితులు యాత్ర విజయవంతం కావాలంటూ వారికి పండ్లు అందజేసి స్వామియే అయ్యప్ప అంటూవీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బొగ్గవరపు సాయిబాబు గోవిందాస్వామి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

గోనె సంచులు అందుబాటులో ఉంచండి

● ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి ఏవో ఎస్.జెన్ని సూచన

పెడన రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరి కోతలు వేగం పుంజుకున్నాయని, గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలని ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి ఏవో ఎస్.జెన్ని సూచించారు. కప్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఎంత ధాన్యం సేకరించారో వివరాలు తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా తేమశాతంఉంటేనే ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర అందుతుందని ఏవో తెలిపారు.



పులిగడ్డ గురుకుల విద్యాలయంలో నిర్వహించిన మెగా పీటీఎంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సంగమూడి హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జార్జికారనేషన్ పాఠశాలలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

విద్యాభివృద్ధే ధ్యేయం

పాఠశాలల్లో మెగా పీటీఎమ్‌లు

కృత్తివెన్ను, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్(పీటీఎంలు) నిర్వహిస్తోంని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం సంగమూడి హైస్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పాఠశాలలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు తన సొంత డబ్బులతో ఈ ఏడాది మొత్తం ఆర్వో వాటర్‌ను సరఫరా చేసేందుకు ముందుకొచ్చారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సురేష్, బీజేపీ కన్వీనర్ చంద్రమౌళి, ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, నీటి సంఘం అధ్యక్షులు కూనసాని శ్రీనివాసరావు, చిలుకూరి చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పెడన: తోటమూల జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పీటీఎంలో సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కుముదినిసింగ్, కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు, హెచ్ఎం వీహెచ్ నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ దేవి పాల్గొన్నారు. బంగ్లా స్కూల్‌లో పీటీఎంలో సహిత విద్య కో ఆర్డినేటర్ కళ్లేపల్లి ఏడుకొండలు, ఎంఈవో-2 వై.వి.హరనాథ్, హెచ్ఎం జి.భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ వైస్‌చైర్మన్ ఎండీ బాబు పాల్గొన్నారు. బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశానికి ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. సరళ కుమారి విచ్చేశారు. ప్రిన్సిపాల్ రామారావు, మాజీ కౌన్సిలర్ కట్టా మూర్తి, కృష్ణాజిల్లా అకడమిక్ గైడెన్స్ అండ్ మానిటరింగ్ ఇన్‌చార్జి పేరిశెట్టి నాగరవి పాల్గొన్నారు.

పెడన రూరల్: పెనుమల్లి, నందిగం, నందమూరు, చేవేంద్ర, చెన్నూరు, ఉరివి నడుపూరు పాఠశాలల్లో మెగా పీటీఎంలు నిర్వహించారు. జడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, ఎంఈవో హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

బంటుమిల్లి: అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎంలో డీసీ చైర్మన్ బొర్రా కాశీ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు మెయిన్ పాఠశాల(చిన్న హైస్కూల్)లో నిర్వహించిన సమావేశంలో డీసీ చైర్మన్ పోతన స్వామి పాల్గొన్నారు. మండల పరిషత్ పాఠశాలల్లో ఎంపీ సంగా మధుసూదనరావు, సర్పంచ్ లింగం సులోచనారాణి, లింగం విజయకుమార్ పాల్గొన్నారు. గూడూరులో విద్యా కమిటీ చైర్మన్లు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ బేగ్, జనసేన నాయకుడు పోతన రామోజీ, మల్లవోలులో ముద్దినేని వెంకటేశ్వరరావు, పడవల మోహన్ త్రినాథ్, కూనపరెడ్డి పెద్దిరాజులు, నరసింహ పాల్గొన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ గురుకుల విద్యార్థులు రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. శుక్రవారం పులిగడ్డ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి నూతన డార్మెటరీ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియాదేవి, ఎంఈవోలు శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, ప్రిన్సిపాల్ జాన్ కనపర్తి, సమగ్ర శిక్ష ఏఎంవో రెడ్రౌతు శ్యాం సుందర్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ దివి శ్రీను, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో అనిత పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

కోడూరు: విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తనపై పర్యవేక్షణ ఉండాలని తల్లిదండ్రులకు నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు సూచించారు. మండలంలో నిర్వహించిన మెగా పీటీఎంలలో ఆయన పాల్గొన్నారు. ఎంఈవోలు టి.వి.ఎం.రామదాసు, కె.నాంచారయ్య, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

చల్లపల్లి: పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహించిన పీటీఎంలో ఎస్ఐ కె.వై.దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెచ్ఎం కేబీఎస్ శర్మ, సర్పంచ్ మాతంగి రమ్య, ఏఎంసీ డైరెక్టరు నాదెళ్ల వెంకట నరసయ్య, మాజీ ఎంపీటీసీ దేవభక్తుని గోపాలకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నారాయణరావునగర్‌లోని మోడల్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, హెచ్ఎం కైతేపల్లి దాస్, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.సీతామహాలక్ష్మి, వైస్ చైర్మన్ ఎస్కే పర్వానా పాల్గొన్నారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మోపిదేవి: మోపిదేవి గురుకుల పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు తల్లిదండ్రులు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కె.వీరరవి ఆధ్వర్యంలో సత్కరించారు.

ఘంటసాల: ఘంటసాలపాలెంలోని సీబీసీఎన్‌సీ స్కూల్‌లో హెచ్ఎం సాల్మన్ రాజు ఆధ్వర్యంలో పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ దోనె రజని విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కొల్లూరి విజయ, గ్రామ ప్రముఖులు దోనె వెంకటేశ్వరరావు, మోహన్, శ్యామ్యూల్, మోషే, మానస పాల్గొన్నారు. ఘంటసాలపాలెం పెద్ద దళితవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో పీటీఎం కార్యక్రమాలు నిర్వహించారు.

నాగాయలంక హైస్కూల్‌లో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం బాగున్నాయి

● కలెక్టర్ డీకే బాలాజీ కితాబు

నాగాయలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక జడ్పీ పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ బాగున్నాయని కలెక్టర్ డీకే బాలాజీ కితాబిచ్చారు. శుక్రవారం జడ్పీ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. తల్లిదండ్రులతో కలసి భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యాబోధన ఎలా ఉందని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగాయలంక సెంటర్‌లో డీఆర్డీయే(వెలుగు)ఆర్థిక సాయంతో నడుపుతున్న శ్రీశ్రీనివాస గ్రామ సంఘం సభ్యురాలు మేడ నాగ బసవమ్మ బెల్లం టీషాపును, గుల్లలమోదలో డీఆర్డీయే(వెలుగు) ద్వారా మత్స్యకారులు నిర్వహిస్తున్న పడవల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ బాలాజీ పరిశీలించారు. తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, తలశిల స్వర్ణలత, ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.



నాగాయలంక హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం నియోజకవర్గంలో..

మచిలీపట్నం టౌన్: జవ్వారుపేటలోని జార్జికారనేషన్ స్కూల్‌లో నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెచ్ఎం పత్రి కేశవరావు, ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం చిత్రపు తిరుమలరావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు పాల్గొన్నారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పి.లక్ష్మి, టీడీపీ నాయకుడు లోగిశెట్టి వెంకటస్వామి, జనసేన నాయకుడు గడ్డం రాజు పాల్గొన్నారు. బందరు మండలం కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎంలో పాఠశాల దాత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. బొమ్మిడి ఏడుకొండలు, పీతా రాము, ఈమన ఏసు, సిహెచ్. అయ్యప్ప, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ పాల్గొన్నారు. చిన్నాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంలో టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, తలారి సోమశేఖర్, లంకే శేషగిరిరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు, నిరంజన్, హెచ్ఎం ధనలక్ష్మి పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన

అవనిగడ్డ, డిసెంబబరు 5 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయటం ద్వారా మహిళలు అదనపు ఆదాయం పొందొచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. బందలాయి చెరువులో మహిళలకు చిరు, పప్పుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారు చేసే విధానాన్ని ఆమె చేసి చూపించారు.



మాట్లాడుతున్న బి.ధన్వంతరీ ఆచార్య, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్

బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ శాఖను
మచిలీపట్నంలో ప్రారంభించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు విడిపోయినందున బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్రాంచ్‌ను మచిలీపట్నంలో ఏర్పాటు చేయాలని బ్రాహ్మణ సంఘ సీనియర్ నాయకుడు డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య డిమాండ్ చేశారు. శుక్రవారం పరాసుపేట సెంటర్‌లోని త్రిపుర సుందరీ ఫౌండేషన్‌లో బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ దశమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సొసైటీలో 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఉండే వారందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం లభిస్తుందని వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామప్రసాద్ దృష్టికి బ్రాహ్మణుల సమస్యలను తీసుకెళుతున్నామన్నారు. కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని, స్వచ్ఛందంగా కోట్లాది రూపాయల నిధులు డిపాజిట్లు చేస్తున్నారని బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఎప్పటికప్పుడు లోకల్ ఫండ్ ఆడిటర్లు ఆడిట్ చేస్తున్నారని, 79 వేల 347 మంది సభ్యులతో రూ.117 కోట్ల నికర రుణాలు అందించామన్నారు. రూ.51 కోట్ల డిపాజిట్లు కలిగి ఉన్నామన్నారు. లక్ష మందితో సభ్యత్వం చేయించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రముఖ వేదపండితుడు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ, బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, న్యాయవాది జొన్నవిత్తుల మల్లికార్జునప్రసాద్, మోపర్తి సుబ్రహ్మణ్యం, వి.ఎస్.ఎస్.ఆర్.శర్మ, ఆర్వీఎస్ మురళీధర్, వాడపల్లి బాలాజీ సువర్ణకుమార్, లొల్లా కుటుంబ శాస్త్రి, నిమ్మగడ్డ శ్రీధర్, వేమూరి సాయి, తంగిరాల మిథునవ్యాస్, వడ్లమన్నాటి మారుతీదివాకర్, చోడవరపు లక్ష్మీ ప్రసన్న, జొన్నలగడ్డ మాధవి పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి రూ.50 వేలు విరాళం

ఘంటసాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన దివంగత మండవ శివరామకృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాంబశివరావు ఘంటసాల పీహెచ్‌సీకి రూ.50 వేలు విరాళాన్ని ప్రకటించారు. శుక్రవారం పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్‌కు శివరామకృష్ణయ్య భార్య మండవ వెంకటరత్నమ్మ రూ.50 వేల నగదును అందజేశారు. నగదును టీవీ, ఆర్వో వాటర్ సిస్టమ్, ఇన్వర్టర్‌కు ఉపయోగించుకోవాలని దాత వైద్యునికి సూచించారు. వేమూరి వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.



కోడూరు నుంచి మోపిదేవి వెళుతున్న టీడీపీ నాయకులు

టీడీపీ మండల అధ్యక్షుడి ఎన్నికకు తరలిన శ్రేణులు

కోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడి ఎన్నికకు మండలం నుంచి మోపిదేవికి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. శుక్రవారం టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను మోపిదేవిలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు నేతృత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై మోపిదేవికి ర్యాలీగా వెళ్లారు.

పైడమ్మకు ప్రత్యేక పూజలు

● రెండో రోజుకు జాతర

పెడన, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర శుక్రవారం రెండవ రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు. తమ మొక్కుబడుల మేరకు కోలాహల వాతావరణంలో శిడిబొమ్మలను ఊరేగించారు. అమ్మవారు శుక్రవారం ఉదయం ఆలయ ప్రవేశం చేశారు. అమ్మవారికి ఈవో జి.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసువాయునందనరావు, ఆశాది దాసు శ్యామ్, పాలక మండలి సభ్యులు స్వాగతం పలికి ఆమెను ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. పైడమ్మ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు శిడిబొమ్మలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. కాపులవీధి నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు ప్రధాన రహదారుల మీదుగా కొత్తపేటలోని పైడమ్మ అమ్మవారి ఆలయం వరకు కొనసాగింది.





పూజలందుకుంటున్న పైడమ్మ, పట్టణంలో ఊరేగుతున్న శిడిబొమ్మలు

రాత్రి 11 గంటల వరకు ఆలయం

జాతర సందర్భంగా దేవస్థానం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచే ఉం టుందని ఈవో జి.వి. కృష్ణారావు తెలిపారు. రోజూ ఉదయం 10.30 గంటల నుంచి 10.45 గంటల వరకు అమ్మవారికి మహానివేదన సమయంలో దర్శనాలు నిలుపుదల చేస్తామని తెలిపారు.



ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సమక్షంలో సీడ్స్ సంస్థప్రాజెక్టు మేనేజరు వేణుగోపాల్‌రెడ్డితో ఎంవోయూ కుదుర్చుకుంటున్న కళాశాల ప్రెసిడెంట్ పీవీ రావు

చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉద్యోగాలు

● జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మచిలీపట్నం టౌన్ , డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లక్షలాది యువతీయువకులు ఇంజనీరింగ్ చదువుతున్నారని, సరైన నైపుణ్యాలు లేక ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. వైజేఆర్ అండ్ డీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఎస్పీ ప్రారంభించారు. సోషల్ ఎంపవర్‌మెంట్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజరు సీహెచ్ గోపాల్‌రెడ్డితో నైపుణ్యాల శిక్షణ కార్యక్రమంపై ఇంజనీరింగ్ కళాశాల ప్రెసిడెంట్ పీవీ రావు ఎంవోయూ కుదుర్చుకున్నారు. యువత ఉద్యోగాల కోసం వెతుకులాడకుండా ఇప్పించే స్థాయికి ఎదగాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సూచించారు. ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాగజ్యోత్స్న, ప్లేస్‌మెంట్ ఆఫీసరు ఉదయభాస్కర్ తదితరులు మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 260 మంది పాల్గొనగా 130 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టాటా ఎలక్ట్రానిక్స్‌కు 15, కోడింగ్ హబ్‌కు 14, ముత్తూట్ ఫైనాన్స్‌కు 30, పానసొనిక్, డైకిన్ 15, ఎంఆర్ఎఫ్ టైర్స్ 27, డ్రీమ్ జాబ్స్ 35, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఇద్దరు, ఇన్ఫోసెర్చ్‌కు ఐదుగురు ఎంపికయ్యారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి
రూ.కోటి మంజూరు

● పూర్వ వైభవం వస్తుంది: మండవ బాలవర్థిరావు

నాగాయలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి దేవాదాయశాఖ సర్వ శ్రేయోనిధి నుంచి రూ.కోటి మంజూరు చేసిందని, దీంతో ఆలయానికి పూర్వ వైభవం వస్తుందని ఏఎంసీ మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి సన్నాహక కమిటీ ప్రతినిధి మండవ బాలవర్థిరావు తెలిపారు. ఆలయానికి నిధులు విడుదల చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



చల్లపల్లిలో దుర్గాబొటిక్ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్త రావాలి

● అందుకు ప్రభుత్వ సహకారమందిస్తాం: కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలని, అందుకు ప్రభుత్వం అన్నివిధాలా చేయూత అందిస్తుందని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన కలెక్టర్ స్వయం సహాయక సంఘాల మహిళల డీఆర్డీయే - వెలుగు ద్వారా ఆర్థిక సహాయం పొంది ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల డ్వాక్రా యూనిట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. చల్లపల్లి అగ్రహారంలో శ్రీలలితాదేవి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు ఆకుల నళిని ఏర్పాటుచేసుకున్న దుర్గాబొటిక్ లేడీస్ టైలరింగ్ యూనిట్ దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్వాహకురాలు నళిని, ఆమెభర్త దుర్గాప్రసాద్‌తో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. డీఆర్డీయే పీడీ హరిహరనాథ్, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఆనందకుమారి, ఏపీఎం కె.శ్రీనివాస్, ఈవో పివి.మాధవేంద్రరావు తదితరులు ఉన్నారు.

మహిళలు ఉపాధి మార్గాల వైపు దృష్టిసారించాలి

మోపిదేవి: మహిళలు ఆర్థిక స్వావలంబనలో భాగంగా స్వయం ఉపాధి మార్గాల వైపు దృష్టి సారించాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. శుక్రవారం పెదప్రోలు గ్రామంలో పీఎంఎఫ్ఎంటీ ప్రతిపాదిత యూనిట్‌ను సందర్శించి నిర్వాహకురాలు అన్నం శివకుమారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఆర్డీయే ప్రాజెక్టు డైరెక్టర్ హరినాథ్, డీపీఎం సుధాకర్, మధు, ఏపీఎం డి.శ్రీను ఆయన వెంట ఉన్నారు.

వ్యాపారాభివృద్ధికి సహకారం

గూడూరు: మల్లవోలులోని శ్రీ వెంకటేశ్వర స్వయం సహాయక సంఘం సభ్యురాలు నండూరి లక్ష్మికి వ్యాపార అభివృద్ధికి ఎంఎస్‌సీఎం పథకం ద్వారా రూ.10 లక్షల చెక్కును కలెక్టర్ బాలాజీ శుక్రవారం అందజేశారు. లక్ష్మి మల్లవోలులో టీ కప్పు తయారీ యూనిట్ నడుపుతోంది. వ్యాపార అభివృద్ధికి మరి కొంత నిధులు అవసరం అవడంతో పోలవరంలోని ఇండియన్ బ్యాంక్ ద్వారా రూ.పది లక్షలను కలెక్టర్ అందజేశారు.

విలేజ్ కిచెన్ గార్డెన్ సందర్శన

అవనిగడ్డ రూరల్: విలేజ్ కిచెన్ గార్డెన్ కార్యక్రమంలో భాగంగా తుంగలవారిపాలెంలో గుండు నాంచారయ్య, అంకెం ఆదిశేషయ్య పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయల పంటలను కలెక్టర్ డీకే బాలాజీ సందర్శించారు. కార్యదర్శి నాగరాణి, సర్పంచ్ తుంగల వాసుదేవరాజు పాల్గొన్నారు.